సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు, వేదికపై పలు పార్టీల నాయకులు

రాజ్యాంగ పరిరక్షణకు 29న ప్రాంతీయ సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక పిలుపు మేరకు ఈ నెల 29న విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరగనున్న ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు విజ్ఞప్తి చేశారు. ఆదివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఎంసిపిఐ పార్టీల నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టాక భారత రాజ్యాంగం మూలసూత్రాలపై తీవ్ర దాడిచేస్తోందని, ప్రజల, ప్రజాతంత్ర హక్కులను హరిస్తోందని తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థ, ఇతర రాజ్యాంగ వ్యవస్థల స్వతంత్రతను దెబ్బతీస్తోందన్నారు. దేశ లౌకికతత్వం, మతసామరస్యంపై దాడిచేస్తోందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐలను తన రాజకీయ అవసరాల కోసం ప్రతిపక్ష పార్టీలపై ప్రయోగిస్తోందని తెలిపారు. ఎన్నికల బాండ్ల పేరుతో వేల కోట్ల రూపాయల నిధులు కూడగట్టి ఎన్నికల వ్యవస్థను అవినీతిమయం చేస్తోందన్నారు. మోడీ ప్రభుత్వం అంగీకరించిన రైతుల పంటల గిట్టుబాటు ధరల చట్టం సంవత్సరాలు గడిచినా పార్లమెంటులో తుది రూపం దాల్చలేదన్నారు. దీంతో రైతులు ప్రజాస్వామ్య పద్ధతిలో ఛలో ఢిల్లీకి పాదయాత్ర చేపడితే తీవ్ర ఆటంకాలు సృష్టిస్తోందని తెలిపారు. శత్రు దేశ సైనికులతో యుద్ధం చేసినట్లు అన్నదాతలపై యుద్ధం చేస్తోందన్నారు. ఇనుప కంచెలు, భారీ బారికేడ్లు, బాష్పవాయుగోళాలు ప్రయోగంతో పాటు చివరకు రైతులపై పోలీసు కాల్పులు జరిపి హర్యానా బిజెపి ప్రభుత్వం శుభకరణ్‌సింగ్ అనే రైతును పొట్టనపెట్టుకుందన్నారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో భారత రాజ్యాంగంపై నేడు జరుగుతున్నంత దాడి గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగ హక్కులు పరిరక్షణకై రాష్ట్ర వ్యాప్తంగా 4 ప్రాంతీయ సదస్సులు జరపాలని భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక పిలుపునిచ్చిందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 29న ఉదయం 10 గంటలకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సు జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ జాతీయ నాయకులు మణిశంకర్ అయ్యర్, జెడి.శీలం, స్వరాజ్యపార్టీ జాతీయ నాయకులు యోగేంద్ర యాదవ్, కమిటీ కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాధీశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జైభారత్ పార్టీ జాతీయ నాయకులు వివి.లక్ష్మీనారాయణ, ప్రత్యేకహోదా, విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు శీరం రమేష్, పూర్వ ఐఎఎస్ అధికారి బండ్ల శ్రీనివాస్ హాజరవుతారన్నారు. వీరితో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రముఖులు, మేధావులు పాల్గొంటారని తెలిపారు.

సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎస్.సుధాకర్, ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ సీతల్, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, సిపిఎం నాయకులు వి.కృష్ణారావు, ఎం.సూరీడు, సిపిఐ నాయకులు జిఎస్‌జె.అచ్యుతరావు, ఎ.క్షేత్రపాల్, ఎస్‌కె.రెహ్మాన్‌లు పాల్గొన్నారు. జిల్లాలో సదస్సు జయప్రదం చేయడానికి కావాల్సిన ప్రణాళికను రూపొందించారు.

బంధుత్వ రాజకీయం..!

- దాడిని దెబ్బతీసేందుకు కొణతాలతో అవగాహన
- అందుకే పీలా మౌనం

పీలా గోవింద సత్యనారాయణ

కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : అనకాపల్లి నియోజకవర్గంలో టిడిపి, జనసేన మధ్య బంధుత్వ రాజకీయం కనిపిస్తోంది. ఇటీవలే టిడిపిలో చేరిన సీనియర్ నాయకుడు దాడి వీరభద్రరావును రాజకీయంగా దెబ్బతీయాలన్న ఉమ్మడి అవగాహనతో బంధువులైన టిడిపి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన తరుపున టికెట్ దక్కించుకున్న కొణతాల రామకృష్ణ కలిసి పనిచేస్తారన్న ప్రచారం ఇక్కడ సాగుతోంది. మరోపక్క నియోజకవర్గంలో టిడిపి కార్యకర్తల అసంతృప్తి మాత్రం తగ్గడంలేదు. టిడిపి, జనసేన పొత్తులో అనకాపల్లి టికెట్ జనసేన తరపున కొణతాల రామకృష్ణకు కేటాయించడంతో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అనుచరుల్లో ప్రారంభమైన అసంతృప్తి క్రమంగా పెరుగుతోంది. ఆదివారం నల్లబ్యాడ్జీలు ధరించి టిడిపి కార్యకర్తలు నిరసన తెలిపారు. కశింకోట మండల టిడిపి నాయకులు మూకుమ్మడి రాజీనామా చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ వెంట వుంటామని ప్రకటించారు. తమ పార్టీ శ్రేణులను సిద్ధంచేసుకొనేందుకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరుచూరి భాస్కరరావును పార్టీ కార్యాలయానికి వెళ్లి కొణతాల కలిశారు. విజయానికి సహకరించాలని కోరారు. పీలా గోవింద్‌కు టిక్కెట్ ఇవ్వకపోవడంతో అనుచరుల నుంచి వ్యక్తమవుతున్న అసంతృప్తిని చల్లార్చడానికి టిడిపి అధినేత చంద్రబాబు రంగంలోకి దిగారు. విజయవాడ వచ్చి కలవాలని ఫోన్ రావడంతో పీలా హుటాహుటిన బయల్దేరి వెళ్లారు. ఏ పరిస్థితుల్లో అనకాపల్లి టిక్కెట్ జనసేనకు కేటాయించాల్సివచ్చిందో చంద్రబాబు ఆయనకు చెప్పినట్లు తెలిసింది. జనసేనకు టిక్కెట్ ఇస్తున్న విషయం చర్చించకుండా ప్రకటించడంతో కార్యకర్తలు తట్టుకోలేకపోతున్నారని పీలా అన్నట్లు తెలిసింది. కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా అనకాపల్లి టికెట్ తనకు కేటాయించాలని పీలా కోరినట్లు తెలిసింది. సాధ్యంకాదని చంద్రబాబు చెప్పడంతో యలమంచిలి టికెట్ ఇవ్వాలని కోరినా, పొత్తులో సాధ్యంకాదని సున్నితంగా చంద్రబాబు తిరస్కరించినట్లు సమాచారం.

అనకాపల్లి టిక్కెట్ గోవింద్‌కు ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయిస్తామని కార్యకర్తలు అంటున్నా ఆయన మాత్రం మౌనంగానే వున్నారు. పీలా, కొణతాల కుటుంబాలకు వున్న బంధుత్వరీత్యా పీలా స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసే అవకాశంలేదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

రాజకీయంగా ఇరు కుటుంబాల మధ్య పరస్పర సహకారం వుంది. అందుకని తనకు టికెట్ ఇవ్వకపోవడంపై అధినేతపై కొద్దిపాటి అసంతృప్తి తప్ప కొణతాలకు ఇవ్వడంపై పీలాకు పెద్ద బాధలేదని పార్టీ వర్గాల్లోనే చర్చ జరుగుతోంది. టిడిపిలో చేరిన సీనియర్ నాయకుడు దాడి వీరభద్రరావును రాజకీయంగా దెబ్బతీయాలన్న ఉమ్మడి అవగాహనతో పీలా, కొణతాల కలిసి పనిచేస్తారన్న ప్రచారం లేకపోలేదు.

వెలగపూడికి బెదిరింపు కాల్స్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శనివారం రాత్రి 8 గంటల నుండి 11 గంటల వరకు పలు నెంబర్ల నుంచి తనకు బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయని విశాఖపట్నం తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం సాయంత్రం ఎంవిపి కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయనకు వచ్చిన ఫోన్ కాల్స్‌పై పోలీసు దర్యాప్తు కొనసాగుతోంది.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోరాడి కాపాడుకుంటామని బిహెచ్ఇఎల్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు ఎస్.జగన్నాధరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి 1060వ రోజుకు చేరాయి. దీక్షల్లో బిహెచ్ఇఎల్, సిఐటియు నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది ప్రాణత్యాగంతో స్థాపించబడ్డ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రైవేటీకరణ వ్యతిరేకంగా జరుగుతున్న ప్రతి పోరాటంలోనూ బిహెచ్ఇఎల్ సిఐటియు నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. దీక్షల్లో ఎస్.ప్రసాద్, కె.నారాయణరెడ్డి, ఎస్.అప్పారావు, జి.అచ్చం నాయుడు, వెంకట్రావు, పి.శివరాం, సిహెచ్ఎస్‌వి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ప్రశాంతంగా గ్రూప్ - 2 పరీక్ష

- విశాఖలో 39,300 మంది, అనకాపల్లిలో 9,060 మంది హాజరు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో గ్రూపు - 2 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్ష నిర్వహణకు అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఉదయం నుంచే పరీక్షా కేంద్రాల వద్ద హడావుడి వాతావరణం కనిపించింది.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) గ్రూప్ - 2 పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 105 పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్ష జరిగినట్లు వెల్లడించారు. 47,491 మంది అభ్యర్థులకుగాను 39,300 మంది అభ్యర్థులు హాజరు కాగా 8,191 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. 82.75 శాతంగా హాజరు నమోదైనట్లు వివరించారు.

పలుచోట్ల తనిఖీలు

ఎంవిపి.కాలనీ : గ్రూప్ - 2 పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తనిఖీ చేశారు. ఆదివారం ఉదయం ఉడా పార్కు సమీపంలో ఉన్న గాయత్రీ విద్యాపరిషత్ ఎంఎల్‌బిటి హైస్కూల్‌ను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్వహణ తీరును పరిశీలించారు. అభ్యర్థుల సంతకాల రిజిస్టర్లను చూశారు. రోల్ నెంబర్ ప్రకారం సీటింగ్ అరేంజ్‌మెంట్ జరిగిందా లేదా అనే అంశాలను పరిశీలించారు. పరీక్ష సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్ పరిశీలించారు ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజ్, ఎవిఎన్.కాలేజ్‌లను ఆయన సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.

అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో గ్రూపు-2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. అనకాపల్లి పట్టణంలోని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రవి పటాన్ శెట్టి, ఎస్‌పి మురళీకృష్ణ సందర్శించారు. జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, మాకవరపాలెం ప్రాంతాల్లో మొత్తం 33 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. మొత్తం 10,627 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా 9,060 మంది హాజరయ్యారు.

మాకవరపాలెం : మాకవరపాలెం మండలం తామరం ఇంజినీరింగ్ కళాశాలలో గ్రూప్-2 పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ సందర్శించారు. నర్సీపట్నం డిఎస్‌పి వెంకటరామయ్య నర్సీపట్నం రూరల్ సిఐ హరి, ఎస్ఐ రామకృష్ణారావులకు తగు సూచనలు చేశారు.

నర్సీపట్నం టౌన్ : ఎపిపిఎస్‌సి గ్రూప్-2 పరీక్ష కేంద్రాలను అడిషనల్ ఎస్‌పి విజయ్‌కుమార్, డిఎస్‌పి వెంకటరామయ్య పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పట్టణ సిఐ కాంతి కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజయ్, రాజు, తాతయ్యబాబు, మల్లునాయుడు తదితరులు

రాష్ట్ర ప్రగతి కోసం టిడిపికి ఓటేయాలి

ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్

ప్రజాశక్తి-వడ్డాది

రాష్ట్ర ప్రగతి, ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యువతీ యువకులు మొట్ట మొదటి ఓటును టిడిపికి వేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పిలుపునిచ్చారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో 'యువతా మేలుకో- ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' పోస్టర్లను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తొలి ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకొని విద్యాలయాల వద్ద తొలి ఓటర్లకు పార్టీ కేడర్ అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. చోడవరం నియోజకవర్గంలో 22,800 మంది తొలి ఓటర్లు ఉన్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గం ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, నాయకులు గూనూరు మల్లునాయుడు, కోటేశ్వరరావు, అప్పలనాయుడు, అప్పారావు, కోట నీలవేణి, ముచ్చకర్ల భవాని, సిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- దేవరాపల్లి

అమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన దేవరాపల్లి మండలం, వేచలం గ్రామంలో ఆదివారం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ట్రస్ట్ సభ్యులు, వేచలం గ్రామ యూత్ కలిసి ప్రారంభించారు. కంటి వైద్య నిపుణులు హరిచందన వైద్య శిబిరంలో 64 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మరో 35 మందికి కంటి ఆపరేషన్‌కి ఎంపిక చేసి, బస్సులో శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్య సేవలు అందిస్తున్న అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రెడ్డి శ్రీలక్ష్మి బలరామ్మూర్తి, చప్పా నాగేష్, వేచలపు నరసింహనాయుడు, వేచలపు రామకృష్ణ, సూరెడ్డి శ్రీను, వేచలపు గోవింద, రెడ్డి శేషు మాస్టార్, రెడ్డి శ్రీనివాస్ రావు, యాళ్ల శ్రీనివాస్, పైడా మధు, కె.రవి, ఆర్ఆర్.సత్యారావు, ట్రస్టు సభ్యులు, గ్రామ యూత్, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో-ఆర్డినేటర్ అశ్వన్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

అనకాపల్లిలో గెలుపునకు సమిష్టిగా కృషి

ప్రజాశక్తి -అనకాపల్లి

టిడిపి, జనసేన సమిష్టగా కృషి చేసి అనకాపల్లి అసెంబ్లీ స్థానాన్ని కైవసం చేసుకుంటామని ఆ రెండు పార్టీల అనకాపల్లి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక బైపాస్ రోడ్లోని జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జి పరుచూరి భాస్కరరావుతో కలిసి కొణతాల విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పరుచూరి భాస్కరరావు తెర వెనుక ఉండి గతంలో అనేక మంది నాయకులను గెలిపించినట్లు చెప్పారు. జనసేన, టిడిపి, బిజెపి ఏకమై రాష్ట్రంలో అధికారంలో వస్తామని, తద్వారా విభజన హామీలను, అమరావతి నిర్మాణం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, స్టీల్‌ప్లాంట్ రక్షణ సాధిస్తామని చెప్పారు. ముందుగా శ్రీనూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు.

అధ్యక్షుల నిర్ణయాన్ని గౌరవిస్తాను : పరుచూరి

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఎన్నికల బరిలో అనకాపల్లి నుంచి ఉమ్మడి అభ్యర్థిగా కొణతాల రామకృష్ణని ప్రకటిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తానని అనకాపల్లి నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ పరుచూరి భాస్కరరావు తెలిపారు. అనకాపల్లి టికెట్ ప్రకటన అనంతరం తీవ్ర అసంతృప్తికి గురైన ఆయన కార్యకర్తలతో పార్టీ కార్యాలయంలో ఆదివారం సమావేశమయ్యారు. ఐదు సంవత్సరాలుగా పార్టీ బలోపేతానికి తనకు అన్ని విధాలుగా సహకరించిన కార్యకర్తలు పార్టీ అధినేత నిర్ణయాన్ని గౌరవించి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ విషయంలో తాను ఎలాంటి తప్పు చేయలేదని, కేవలం తాను కాపు, గవర కులంలో పుట్టకపోవడమే తాను చేసిన తప్పు అని ఉద్వేగానికి గురై కంటతడి పెట్టారు. టికెట్ ఇవ్వకపోతే పార్టీ మారే తత్వం తనది కాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో పాల్గొన్న కొణతాల రామకృష్ణ, పరుచూరి భాస్కరరావు

తాగునీటి సమస్యపై మహిళల నిరసన

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం కోటవీధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యం ఆదివారం మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మంచి నీళ్ళ కోసం చాలా ఇబ్బంది పడుతున్నామని, రోడ్లు, డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో వీధి కుళాయిలు ఉన్నప్పుడు మంచినీళ్లకి ఇబ్బందులు లేకుండా అందరూ ఒకే చోట పట్టుకున్నా కూడా నీళ్లు దొరికేవని, కానీ ఇంటింటి కుళాయిలు వేసినప్పటి నుండి కనీసం నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు ఓట్లు కోసం వచ్చినప్పుడు సమస్యలను పరిష్కరిస్తామని చెబుతూ, గెలిచాక పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పరదేశితల్లి గుడి వెనక ఉన్న వీధిలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చే ఎలక్షన్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆనాల దేవి, రుత్తల లక్ష్మి, డి.రమణమ్మ, జె.సత్యవతి, లక్ష్మి, సావిత్రి, వరలక్ష్మి, పద్మ, విజయలక్ష్మి, అల్లంకి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న మహిళలు

రెచ్చిపోతున్న కోళ్ల దొంగలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని పలు గ్రామాలలో రైతుల కల్లాల వద్ద నాటు కోళ్ళు, గొర్రెపోతులను అర్ధరాత్రి సమయాల్లో అపహరించకపోతున్నారు. దీంతో రైతుల తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొద్దిరోజులుగా మండలంలోని గొన్నవానిపాలెం శివారు ప్రాంతంలో సుమారు రూ.50వేలు విలువ చేసే కోడిపుంజులను ఎత్తుకుపోయారు. రెండు రోజుల క్రితం దిబ్బిడి గ్రామంలోని బంటు వారి కల్లాలు, గొంప వారి కల్లాలు వద్ద మరో రూ.50 వేలు విలువచేసే కోళ్లను, రూ.20 వేలు విలువచేసే గొర్రె పొట్టేలును అపహరించారు. పశువుల కల్లాల వద్ద పెంచుకుంటున్న కోళ్లను లక్ష్యంగా చేసుకొని అర్ధరాత్రి సమయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. పోలీసులు కోళ్ల దొంగలను గురించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అనంతపురం పట్టణంలో సోమవారం జరుగు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు తనకాల అనంతరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎంవిఆర్ రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ పునర్నిర్మాణ సభకు ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు జనాల్లో తీసుకెళ్లడానికి, ఎన్నికల శంఖారావం పూరించడానికి కాంగ్రెస్ కార్యకర్తలకు ఈ సభలో దిశా దశ నిర్దేశం చేస్తారని తెలిపారు.

ఎడ్ల పరుగు పందెం నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండల కేంద్రం దేవరాపల్లిలో శ్రీఉమామహేశ్వరి దేవి కళ్యాణం మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. 22 ఎడ్ల బళ్ళు ప్రదర్శనలో పాల్గొన్నాయి. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.18 వేలు, 3వ బహుమతి రూ.16 వేలు, 4వ బహుమతి రూ.14 వేలు, ఐదువ బహుమతి రూ.12 వేలు, ఆరవ బహుమతి రూ.10వేలు, 7వ బహుమతి రూ.8వేలు, 8వ బహుమతి రూ.6వేలు, తొమ్మిదవ బహుమతి రూ.4వేలు, పదవ బహుమతి రూ.2వేలు వెసిపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు చేతులు మీదుగా అందజేశారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటాలు, డాన్స్ బేబీ డాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

29న భువనేశ్వరి పర్యటన

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఈనెల 29న చోడవరం నియోజకవర్గంలో పర్యటిస్తారని టిడిపి నియోజకవర్గం ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో మృతి చెందిన వారి కుటుంబాలను భువనేశ్వరి కలుస్తారని చెప్పారు. నియోజకవర్గంలోని రోలుగుంట, రావికమతం, బుచ్చయ్యపేట మండలాల్లో ఆమె పర్యటిస్తారని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2012-13 విద్యా సంవత్సరంలో పదవ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం రాజాం మరిడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద ఆత్మీకంగా కలుసుకున్నారు. 10 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు గత స్మృతులను స్మరించుకున్నారు. పదేళ్లుగా ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం వేరువేరు ప్రాంతాల్లో ఉండి కలుసుకోవడం ఆనందంగా ఉందని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

27న మహా పాదయాత్రను జయప్రదం చేయాలి

ఉక్కు నిర్వాసిత కాలనీల్లో ప్రచారం

ప్రజాశక్తి -యంత్రాంగం

ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 27న చేపట్టే మహాపాదయాత్ర, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన నిర్వాసిత కాలనీల్లో ఆదివారం ప్రచార పాదయాత్ర నిర్వహించారు.

గాజువాక : గంగవరం గాంధీ విగ్రహం సెంటర్ నుంచి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు, ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు పాదయాత్ర చేపట్టారు. నిర్వాసిత కాలనీ మొత్తం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి.అప్పారావు, ఐఎన్‌టియుసి నాయకులు పి.వి.రమణమూర్తి మాట్లాడుతూ, విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మకానికి వ్యతిరేకంగా ఈ నెల 27వ తేదీన కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం నుంచి నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వరకు మహా పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహా పాదయాత్రలో ఉక్కు కార్మిక వర్గం, నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని నరేంద్ర మోడీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార పాదయాత్రలో పోరాట కమిటీ నాయకులు జి.ఆనంద్, పేర్ల సత్యారావు, కె.పోతన్న, కారి సూరకాజు, పోలారావు, జి.అమ్మోరు, సిహెచ్.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడలో..

పెదగంట్యాడ కూడలిలో ప్రారంభమైన పాదయాత్ర ఫైర్ స్టేషన్, సిద్ధేశ్వరం, కొరాడ, నడుపూరు కూడలి నుంచి తిరిగి పెదగంట్యాడ కూడలికి చేరుకుంది. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి, నమ్మి రమణ, ప్రభాకర్‌రెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ, ఎన్నో పోరాటాలు, 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమ్మేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ఐక్య ఉద్యమాలతో ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటామన్నారు. 27న జరిగే మహా పాదయాత్రలో ఉక్కు కార్మికులు, నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొందేసి మహేశ్వరరెడ్డి, బొడ్డు పైడిరాజు, మంత్రి శంకరనారాయణ, సత్తి శ్రీనివాసరెడ్డి, నీరుకొండ రామచంద్రరావు, గవర అప్పారావు, ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : అగనంపూడి, కూర్మన్నపాలెం, వడ్లపూడి నిర్వాసిత కాలనీల్లో ప్రచార పాదయాత్ర చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించే వరకు ఈ ఉద్యమం ఆగదని స్పష్టంచేశారు. అత్యంత విలువైన ఈ ప్లాంటును తక్కువ ధరకే ప్రయివేట్, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నిర్వాసితులందరికీ ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఈ నెల 27వ తేదీన తలపెట్టిన మహా పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వడ్లపూడి పాదయాత్రలో పాల్గొన్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

అగనంపూడి పాదయాత్రలో పాల్గొన్న అయోధ్యరామ్ తదితరులు

పెదగంట్యాడలో పాదయాత్ర నిర్వహిస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

గ్రామీణ వైద్యుల సమావేశం

ప్రజాశక్తి -ఆనందపురం : ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన వేములవలసలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జంగం జోషి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గీతం విద్యాసంస్థల అధినేత మతుకుమిల్లి శ్రీభరత్, భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక వైద్యుల సేవలు ప్రశంసనీయమన్నారు. వారి సేవలకు ప్రభుత్వాలు తగిన గుర్తింపు నివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అంగటి రాము, భీమిలి నియోజకవర్గం వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గుండు చిన్నబాబు, గ్రామీణ వైద్యులు నారాయణరావు, నర్సింగరావు, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక మణికంఠ స్వీట్స్ అండ్ బేకరీ మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆదివారం మణికంఠ స్వీట్స్ అండ్ బేకరీ యాజమాన్య ప్రతినిధులు ఆదిమూలం నాగరాజు, సత్య నారాయణ ప్రారంభించారు. వేసవి సీజన్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వెంపాడ శ్రీనివాసరెడ్డి, జోగ వాసు తదితరులు పాల్గొన్నారు.

యాదవ భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 8వ వార్డు పరిధి ఎండాడ జాతీయ రహదారికి అనుకుని యాదవ భవనానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, రాష్ట్రంలో యాదవ సామాజిక వర్గాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా గుర్తించి ఈ భవనాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి కె.నాగేశ్వరరావు, మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, ఎంపీ ఎంవివి సత్యనారాయణ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెట్, డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -తగరపువలస : టెట్, డిఎస్‌సి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు స్థానిక ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యాన ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సొసైటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గంటన మోహనరావు, రేఖ అప్పారావు తెలిపారు. భీమిలి ఒకటో జోన్ సంతపేటలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఉన్నత పాఠశాలలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు.

4న సుద్దాల అశోక్ తేజ రాక

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రముఖ సినీ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ మార్చి 4వ తేదీన భీమిలి రానున్నట్లు స్థానిక కళా సాహితీ సంస్థ అధ్యక్షులు పొత్తూరు రాజేంద్ర ప్రసాద్ వర్మ ఆదివారం తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యాన స్థానిక చిన్న బజారు శ్రీనివాస ఫంక్షన్ హాల్లో మార్చి 4న సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు జరగనున్న ఇష్టా గోష్ఠిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సమగ్ర శిక్ష ఎపిసి శ్రీనివాసరావు విద్యార్థినులకు సూచించారు. స్థానిక కెజిబివిని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్ విద్యార్థినులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు ఇప్పటికే పూర్తిచేసిన సిలబస్‌ను పదేపదే చదవాలన్నారు. సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. ఎజిసి డిఒ గీత మాట్లాడుతూ, ఒత్తిడికి లోనవ్వకుండా ప్రణాళికా బద్ధంగా చదవాలని కోరారు. పరీక్షల సమయంలో భయాందోళన అవసరం లేదన్నారు. ఎఎంఒ లక్ష్మి, ప్రిన్సిపల్ గంగా కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన కిడ్డీస్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరంలోని డెయిరీఫారం సమీపంలోని ఆదర్శనగర్ లిటిల్ కిడ్డీస్ ప్లేస్కూల్‌లో ఆదివారం కిడ్డీస్ ఎక్స్ పో నిర్వహించారు. ఎల్‌కెజి, యుకెజి పిల్లలు నేర్చుకున్న విజ్ఞాన అంశాలను వివిధ నమూనాల రూపంలో ప్రదర్శించారు. చిన్నారుల్లోని సృజనాత్మక శక్తి, వాక్పటిమ వల్ల అవగాహన పెరిగి మరింత చురుకుగా ముందుకెళ్లడానికి ఇలాంటి ప్రదర్శనలు ఉపయోగపడతాయని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు, నమూనాలు ఆహూతులను ఎంతగానో అలరించాయి.

డిజిటల్ ఇండియాపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని సొంట్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యాన ఆనందపురం మండలంలో గల కణమాం గ్రామంలో ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదివారం గ్రామంలో డిజిటల్ ఇండియాపై అవాగాహన కల్పించారు. వివిధ ప్రభుత్వ పథకాలు, ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు, సుకన్య సమృద్ధి యోజన పథకాలు, డిజిటల్ లిటరసీపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆబోతు అప్పలరాము, ఎన్‌ఎస్‌ఆర్‌ఐటి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంభుప్రసాద్, డైరెక్టర్ రాజ మురగదాస్, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ హరగోపాల్ పాల్గొన్నారు.

ముగిసిన జనసేన పల్లె యాత్ర

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం మండలంలోని అయినాడులో ఈ నెల 22వ తేదీన ప్రారంభమైన జనసేన పల్లె యాత్ర ఆదివారం మద్ది గ్రామంలో ముగించారు. ఈ సందర్భంగా జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు భీమిలి నియోజకవర్గం పదేళ్లు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. ఏ గ్రామంలో చూసినా సమస్యలే కనిపిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు కె.రామస్వామినాయుడు, నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల రక్తదాన శిబిరాలు

రక్తదానం చేసిన యువతను అభినందిస్తున్న ఎంపిపి రాంబాబు

ప్రజాశక్తి -యంత్రాంగం

పద్మనాభం : ఎన్జీవో దినోత్సవం, ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని కృష్ణాపురంలో కృష్ణాపురం యూత్ అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ సంస్థల ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. 40 మంది యువకులు రక్తదానం చేశారు. ప్రయివేట్ విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్యా హక్కు ప్రవేశాల గురించి ప్రజాస్వామ్య పరిరోణ ఐక్యవేదిక ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పద్మనాభం ఎంపిపి కె.రాంబాబు, కృష్ణాపురం గ్రామ పెద్దలు మొకర అప్పలనాయుడు, సుంకర అచ్చిమనాయుడు, గాడు అప్పలరాజు, నరసింహనాయుడు, సురాల దేసయ్య రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.రాంబాబు మాట్లాడుతూ, కృష్ణాపురం యూత్ ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి 21 రోజులకు ఒకసారి రక్త మార్పిడి చేసుకునే తలసేమియా పిల్లలు కోసం ఈ కార్యక్రమం చేపట్టిన యువతను అభినందించారు.

సీతమ్మధార: విశాఖ జిల్లా కళింగ వైశ్య యువజన చైతన్య సేవా సంఘం ఆధ్వర్యాన సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని తమిళ్ కలాయ్ మందిరంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా యూత్ కమిటీ అధ్యక్షులు తాలాసు సాయి మోహనరావు, సెక్రటరీ భోగి ప్రవీణ్ పిలుపుమేరకు ముఖ్య అతిథిగా ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, 14వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్‌రాజు, వైశ్య రాజు జ్యూయలర్స్ అధినేత వైశ్యరాజు భద్రగిరిరాజు హాజరై మాట్లాడారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కోమటి సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ పొట్నూరు గణేష్‌కుమార్, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ సకలాభక్తుల ప్రసాదరావు, సంఘం కంచరపాలెం గౌరవాధ్యక్షులు పొట్నూరు మాధవి మధుసూధనరావు, అక్కయ్యపాలెం సంఘం కమిటీ సభ్యులు మోనింగి సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న కళింగ వైశ్య యువజన సంఘం సభ్యులు

వధూవరులకు ప్రముఖుల ఆశీస్సులు

- వైభవంగా శరత్‌చంద్ర రవి, పూజిత వివాహం

నూతన వధూవరులకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-కోటవురట్ల : జల్లూరు వద్ద ఆదివారం జరిగిన శరత్‌చంద్ర రవి, పూజిత వివాహ వేడుకలకు ప్రముఖులు హాజరై శుభాకాంక్షలు తెలిపి, నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకల్లో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, ఇతర ప్రముఖులు నూతన వధూవరులను శుభాసీస్సులు అందించారు. వీరితో పాటుగా మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, ప్రజలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేదిక వద్ద విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకోగా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

- ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ మహేంద్రనాథ్

రోడ్డు విస్తరణలో విద్యుత్ పనులను పరిశీలిస్తున్న ఎస్ఇ మహేంద్రనాథ్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎల్.మహేంద్రనాథ్ స్పష్టం చేశారు. ఆదివారం నర్సీపట్నం మున్సిపాలిటి పెదబొడ్డేపల్లిలోని విద్యుత్ శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సీపట్నం డివిజన్‌లోని వినియోగదారులకు లోవోల్టేజీ సమస్య లేకుండా విద్యుత్‌ను అందజేసేందుకు స్థానిక సబ్ స్టేషన్లలో అదనపు ఫీడర్లు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే ఇండోర్ సబ్ స్టేషన్‌లో అదనపు 5ఎంవిఎ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. రానున్న వేసవిలో విద్యుత్‌కు ఇబ్బందులు లేకుండా అవసరమైన ముందస్తు చర్యలకు అధికారులను ఆదేశించామని, కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లను సిద్ధంగా ఉంచామన్నారు. రైతులు కోరిన వెంటనే విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పాడేరు డివిజన్‌లో అన్ని మారుమూల గ్రామాలకు విద్యుత్ అందే లక్ష్యంతో పివిటిజిలకు ఇప్పటికే ఉచితంగా ఐదు వేల మీటర్లు అందజేసామని, మరో మూడు వేలు మీటర్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. గిరిజనులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా ప్రభుత్వపరంగా ఇస్తామని, ఎవరూ విద్యుత్ చౌర్యానికి పాల్పడ వద్దని సూచించారు. గిరిజనులు గ్రామాలలో ప్రజలు ప్రమాదకరమైన వాటర్ హీటర్లు వాడవద్దని కోరారు..కొత్త మీటరు ఏర్పాటుకు ముందే వారికి కావలసిన లోడ్ చూసి ఇవ్వాలని ఆదేశించారు. విద్యుత్ బిల్లు ఇచ్చిన 15 రోజులలో చెల్లించాలని వినియోగదారులకు సూచించారు. అనంతరం నర్సీపట్నంలో రోడ్డు విస్తరణలో జరుగుతున్న విద్యుత్ పనులను పరిశీలించారు.కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఇఇ విడివి రామకృష్ణ, ఎడిఇలు, ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఉత్సవాల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

- టిటిడిలో విలీనం తర్వాత సాంప్రదాయాలకు మంగళం
- ఆలయ అధికారులను నిలదీసిన భక్తులు, గ్రామస్తులు
- ప్రతిశనివారం అన్నసమారాధన రద్దుపై ఆగ్రహం

ప్రజాశక్తి- నక్కపల్లి : ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఉత్సవాల నిర్వహణలో టిటిడి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు, భక్తులు మండిపడ్డారు. వచ్చేనెల 20న శ్రీవారి వార్షిక కల్యాణోత్సవాలను పురస్కరించుకుని పెండ్లిరాట ఉత్సవం జరిగింది. అయితే .కల్యాణోత్సవాలకు టిటిడి ఉన్నతాధికారులు ఇంకా ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.టిటిడి అధికారుల నిర్వాకాన్ని నిరసిస్తూ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు, వెంకటరమణ (బుజ్జి), గ్రామ సర్పంచ్ ప్రగడ వీరబాబు, గ్రామస్తులు సిద్దాబత్తుల కృష్ణ, నున్న కాశి తదితరులు ఆలయ సూపరెంటిండెంట్ వెంకటకూర్మేశ్వరరావును నిలదీశారు.

దేవాదాయశాఖ పరిధిలో ఉన్న వెంకన్న ఆలయాన్ని టిటిడిలో విలీనం చేసిన తర్వాత మొదటి ఏడాది మాత్రమే స్వామి వార్షిక కల్యాణోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, ఇతర పూజలను టిటిడి వైభవంగా నిర్వహించిందని, మరుసటి ఏడాది నుంచి అంతా నామమాత్రం చేసేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్సవాల్లో గ్రామస్తులు, భక్తలను భాగస్వామ్యం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. గతనెలలో నిర్వహించిన ధనుర్మాసోత్సవాలను కూడా సక్రమంగా చేయలేదన్నారు. పూర్వం నుండి ఆచారంగా వస్తున్న తిరువీధి సేవలను టిటిడి ఎత్తేయాలని చూడడం సరికాదన్నారు.

ఆలయ సూపరింటెండెంట్‌ను నిలదీస్తున్న గ్రామస్తులు, భక్తులు

గతంలో ప్రతి శనివారం ఆలయంలో అన్న సమారాధనను రద్దు చేయడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రశ్నించారు. టిటిడిలో విలీనమైతే ఆలయాభివృద్ధి జరుగుతుందని, శ్రీవారి పూజలు, కైంకర్యాలు శాస్త్రోక్తంగా జరుగుతాయని ఆశిస్తే, భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా టిటిడి స్పందించాలని, శ్రీవారి అన్ని పూజలు, క్రతువులు గతంలోలా వైభనంగా నిర్వహించాలని, లేకుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ఉత్సవాలను చేయలేమని టిటిడి తప్పుకుంటే, తామంతా భక్తుల భాగస్వామ్యంతో జరుపుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై సూపరెంటిండెంట్ స్పందిస్తూ, తమ చేతిలో ఏదీ లేదని, భక్తులు తమ ఆవేదనను లిఖితపూర్వంగా రాసిస్తేఉన్నతాధికారులకు నివేదిస్తాననిబదులిచ్చారు.

తప్పుడు వివరాలతో అంబేద్కర్‌ను అవమానిస్తారా?

- విగ్రహ శిలాఫలకంపై తప్పుడు మరణం వివరాలు నమోదు
- ఎమ్మెల్యే బాధ్యతారాహిత్యంపై టిడిపి దళిత నేతల ఆగ్రహం

అంబేద్కర్ విగ్రహం వద్ద శిలాఫలకం చూపుతున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఘోరంగా అవమానించారని తెలుగుదేశం పార్టీ నర్సీపట్నం దళిత నాయకులు నేతల నాగేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం మాట్లాడుతూ పెదబొడ్డేపల్లి నుంచి వెంకటేశ్వరస్వామి గుడి వరకు రోడ్డు ఏర్పాటులో భాగంగా జాతీయ నాయకుల విగ్రహాలను ఆవిష్కరించారన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహదాత ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకంలో అంబేద్కర్ మరణం వివరాలను నిర్లక్ష్యంగా తప్పుగా ముద్రించారన్నారు.

1956 డిసెంబరు 6న అంబేద్కర్ చనిపోతే, 1902 జులై 4న చనిపోయినట్లుగా అవగాహనా రాహిత్యంగా ముద్రించడం సమంజసం కాదన్నారు. 1891 ఏప్రిల్ 14న అంబేద్కర్ జన్మిస్తే, కేవలం 11 ఏళ్లకే చనిపోయినట్లు మరణం వివరాలను 1902 జులై 4 అని పేర్కొంటే, కనీసం పరిశీలన చేయకపోవడం బాధ్యతా రాహిత్యమన్నారు. ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి, ఓట్లను దండుకునేందుకు ఇలా హడావిడి, ఆర్భాటాలు చేయడం సరికాదన్నారు. అరకొర రోడ్డు పనులైనా జరగకుండానే పాఠశాలల విద్యార్థులు, డ్వాక్రా మహిళలను తీసుకొచ్చి హంగామా చేయడం దేనికని ప్రశ్నించారు. అంబేద్కర్‌ను అవమాన పరిచేలా వ్యవహరించిన స్థానిక ఎమ్మెల్యే దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గాతాడ సహదేముడు పాల్గొన్నారు.

'గవిరెడ్డి'కి టికెట్ ఇస్తే గెలిపిస్తాం

ప్రజాశక్తి - చీడికాడ : పార్టీ కోసం, ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకు వచ్చే ఎన్నికల్లో మాడుగుల నియోజకవర్గ టిడిపి టిక్కెట్ కేటాయిస్తే, పార్టీ కేడరంతా సమిష్టిగా కృషి చేసి మంచి మెజార్టీతో గెలిపించుకుంటామని పార్టీ నేతలు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం కొత్తపల్లి ఆశ్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పాతల చిన్నంనాయుడు ఆధ్వర్యంలో మండలంలోని 23 పంచాయితీల టిడిపి నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో నిర్ణయించి, తీర్మానించారు. సమావేశంలో పార్టీ తాజా, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు మాజీ జెడ్‌పిటిసి కార్యకర్తలందరూ ఏకతాటిపైకొచ్చి, ఒక్కొక్కరుగా వ్యక్తిగత ప్రమాణం చేశారు మాడుగుల ఎమ్మెల్యే టిక్కెట్ రామానాయుడుకు ఇస్తే సునాయాసంగా విజయం సాధించవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి పోతుల రమణమ్మ, మండల కార్యదర్శి బొబ్బాది తాతారావు, సర్పంచులు గాలి సామాలమ్మ, బాలకృష్ణ, కొల్లుసూరినాయుడు, ఎంపిటిసిలు పైలా ముత్యాలనాయుడు, గాడి నాగరత్నం, ప్రసాద్, దారపు పెద్దినాయుడు, మాజీ సర్పంచ్ గండి లక్ష్మి, మండల స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

విస్తృత స్థాయి సమావేశంలో మండల టిడిపి నేతల ప్రమాణం

అల్లూరి చారిత్రక స్మృతులను పరిరక్షించండి

ప్రజాశక్తి-గొలుగొండ : మన్యం వీరుడు అల్లూరి చారిత్రక స్మృతులను పరిరక్షించాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు కోరారు. ఆదివారం మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడుకు స్వగృహానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. తెలుగుదేశం పార్టీ నర్సీపట్నం శాసనసభ స్థానాన్ని అయ్యన్నకు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

అయ్యన్నకు వినతిపత్రం అందజేస్తున్న వీరభద్రరావు

ఈ సందర్భంగా పడాల వీరభద్రరావు మాట్లాడుతూ నర్సీపట్నం నియోజక వర్గంలో కృష్ణదేవిపేటలో అల్లూరి, గాం గంటందొర సమాధులు ఉన్న అల్లూరి స్మారక పార్కు, నర్సీపట్నంలో నర్సీపట్నం-చింతపల్లి ఘాట్ రోడ్లో అల్లూరి సేనలకు, బ్రిటిష్ సేనలకు జరిగిన భీకర యుద్ధంలో హతులైన బ్రిటీష్ సేనానులు కవర్టు, హైటర్ల సమాధులు అల్లూరి చరిత్రలో సాక్షిభూతంగా నిలిచాయన్నారు. వాటిని పరిరక్షించడంలో, అభివృద్ధి చేయడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. కృవిపేట అల్లూరి స్మారక పార్కు ప్రహరీ గోడ కూలిపోయిందని, లోపల కట్టడాలు శిధిలావస్థకు చేరుకుంటున్నాయని, పైపులైన్లు దెబ్బతిని పర్యాటకులు గుక్కెడు మంచినీళ్లు తాగడానికి కూడా ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు

ఇక్కడ సౌకర్యాల కల్పనకు రూ.66లక్షలు మంజూరు చేశామని ఒకసారి, రూ. 50 లక్షలు అంటూ మరోసారి సాక్షాత్తు డిప్యూటీ సీఎం ప్రకటించి ఏడాది గడిచినా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని పడాల ఆరోపించారు. కవర్టు, హైటర్ల సమాధుల స్థలాన్ని అధికార పార్టీకి చెందిన వారే ఆక్రమణకు యత్నించారని, దీనిపై మీడియాలో ప్రచారం జరగడం, స్థానిక ప్రజల అడ్డుకోవడంతోవెనక్కు తగ్గారన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి అధికారంలోకి వచ్చి, అయ్యన్నపాత్రుడు మంత్రి కావాలని, నర్సీపట్నం నియోజకవర్గం పరిధిలో ఉన్న కృష్ణదేవిపేట అల్లూరి పార్కు, నర్సీపట్నంలోని చారిత్రమ సమాధులు అభివృద్ధి చెందాలని పడాల వీరభద్రరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

వైభవంగా వెంకన్న పెళ్లి రాట ఉత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి : ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో వచ్చేనెల 20 నుంచి 26వరకు నిర్వహించనున్న స్వామి వార్షిక కల్యాణోత్సవాల పెళ్లి రాట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి రాజగోపాల కృష్ణ మాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో భక్తుల గోవింద నామ స్మరణల మధ్య అంగరంగ వైభవంగా పెండ్లిరాట ఉత్సవం జరిగింది తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆలయ అర్చకులు తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందు మూలంగా యావన్మంది ప్రజానీకానికి నా క్లయింట్ అయిన మల్ల అప్పలరాజు, S/o లేటు అప్పారావు మరియు ఇతని భార్య మల్ల దుర్గాభవాని నివాసం డోర్ నెం.55-4-102, ఓల్డ్ వెంకోజీపాలెం, హెచ్.బి.కోలనీ, విశాఖపట్నం, 530022 ఇచ్చిన బోగట్ట ప్రకారం మద్దిలపాలెం సర్వే నెంబర్ 26/20లో ఉన్న 110 గజాల నివాశ స్థలంకు ఎల్లపు గంగయ్యమ్మ మరియు ఈమె కుమారుడు అయిన ఎల్లపు నాగసూరి అప్పారావు ఇరువురు కలిసి ప్రభుత్వం వారయిన కలెక్టరు గారు మరియు మున్సిపల్ కమీషనర్ గార్లకు సర్వే నెం. 26/20ను సర్వే నెంబరు 28గా చూపిస్తూ ఫిర్యాదులు చేసన్తూ నా క్లయింట్‌ను మానసికంగా ఇబ్బంది పెడుతున్నారు. కనుక ఈ సర్వే నెంబరుకు సంబంధించి ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఈ నోటీసు తేది నుంచి వారం రోజులలోగా సంబంధిత దస్తావేజులతో సంప్రందించగలరు.

R.D.V.Prasad Rao, R.Neelima
Advocate & Notary
D.No.44-5-7, Flat No.303,
Sai Sravanthi Aprts,
TC Palem, Visakhapatnam

మహిళా సాధికారతతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మహిళా సాధికారత ద్వారానే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు ఈర్లె అనురాధ అన్నారు. మండలంలోని తారువలో ఆదివారం జరిగిన వైసిపి మహిళా విభాగం జిల్లా సమీక్షా సమావేశంలో అనురాధ మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నామినేటెడ్ పదవుల్లో 50శాతం మహిళలకు కేటాయించినట్లు చెప్పారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా 3,43,02,005 మంది మహిళా లబ్ధిదారులకు రూ.95,867.10 కోట్లు, ప్రత్యక్ష ప్రయోజన బదిలేతర 30,76,018 మంది మహిళా లబ్ధిదారులకు రూ.75,670.05 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, దేవరాపల్లి, మాడుగుల, కోటపాడు మండలాల వైసిపి అధ్యక్షులు, మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

300 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ (బిఐఎసి) ఆవరణలో ఆదివారం నిర్వహించిన 121వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 300 మంది రోగులకు నేత్ర వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు అనంతరం 212 మందికి ఉచితంగా అద్దాలు, 89 మందికి మందులు అందజేశారు. 25మందికి కేటరాక్ట్ సర్జరీ చేయించుకోవాల్సిందిగా వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమానికి వచ్చినవారికి మజ్జిగ, పలహారాలు, భోజనం సదుపాయం బ్రాండిక్స్ యాజమాన్యం కల్పించింది. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడుతూ బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని చెప్పారు.

పద్మశాలి సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : మండల కేంద్రంలోని పద్మశాలి సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా సప్పా కొండలరావు, ఉపాధ్యక్షులుగా పప్పు శ్రీను, కార్యదర్శిగా కోసూరి నారాయణరావు, సంయుక్త కార్యదర్శి-1గా వంక సూర్యనారాయణ, సంయుక్త కార్యదర్శి-2గా దొడ్డి సత్యనారాయణ, కోశాధికారిగా నేమాల హరితో పాటో మరో 20 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు, నాయకులు ఋషిబాబు మాట్లాడారు. సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో చోడవరం టౌన్, గాంధీ గ్రామం, నరసయ్యపేట ప్రాంతాలలో ఉన్న పద్మశాలి సమాజిక తరగతికి చెందిన వారు పాల్గొన్నారు.

'సంపతిపురం లే-అవుట్ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలి'

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం అచ్చయపేట గ్రామాన్ని అనుకొని ఉన్న సంపత్‌పురం లేఅవుట్ 2/2లో జరుగుతున్న 303 ఇళ్ల నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ అనకాపల్లి జోనల్, మండల కార్యదర్శులు వైఎన్.భద్రం, చెల్లూరు నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్రికల్లో కథనాలు వచ్చిన నేపథ్యంలో లబ్ధిదారులు పట్టాలను, అక్రమాల్లో అధికారుల పాత్రను సమగ్రంగా విచారణ జరిపించాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార పార్టీని అడ్డం పెట్టుకొని, అధికారులను లొంగదీసుకుని అక్రమాలకు పాల్పడుతూ కోట్ల రూపాయల అర్జించిన వారిపై చర్యలు తీసుకోకుంటే సిపిఐ ప్రత్యక్ష ఆందోళనకు పూనుకుంటుందని హెచ్చరించారు.

సామాజిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార: జివిఎంసి 53వ వార్డు పరిధి నరేంద్రనగర్‌లో రూ.50 లక్షలతో రెండు అంతస్తులు నూతన సామాజిక భవనం నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ బర్కత్ అలి ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ రత్నాకర్, వైసిపి నాయకులు కృష్ణారావు మాస్టర్, అమర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమృత ఆహారం పండించి ఆరోగ్యంగా జీవించండి

ప్రజాశక్తి-వేపగుంట : అమృత ఆహారం పండించి ఆరోగ్యంగా జీవించాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పిలుపునిచ్చారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యాన సింహాచలం గోశాలలో కూరగాయల మొక్కలకు అంట్లు కట్టే శిక్షణా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కూరగాయ మొక్కలకు అంట్లు కట్టడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని శ్రీధర్ చెప్పారు.

ఎమ్మెల్యే ధర్మశ్రీకి టికెట్ ఇవ్వొద్దంటూ నినాదాలు

ఇవ్వాలంటూ మరో గ్రూపు ఆందోళన
విశాఖ డెయిరీ వేదికగా తోపులాట

ప్రజాశక్తి -గాజువాక : చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ ఇవ్వొద్దని ఒక గ్రూపునకు చెందిన వారు రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముందే నినదించారు. మరో గ్రూపు సభ్యులు టికెట్ ఇవ్వాలని నినదించారు. దీనికి విశాఖ డెయిరీ వేదికైంది. పెద్ద పెద్ద కేకలు, అరుపులతో విశాఖ డెయిరీ మార్మోగింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వరాదని కోరుతూ బుచ్చయ్యపేట మండలానికి చెందిన విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ వివిధ సందర్భాల్లో బహిరంగంగా చెబుతూ వస్తున్నారు. గతంలో గేదెల సత్యనారాయణ టిడిపిలో ఉండేవారు. విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ వైసిపిలోకి వచ్చిన తర్వాత ఆయన కూడా ఆ పార్టీలో చేరారు. అయినా సరే ధర్మశ్రీకి వ్యతిరేకంగానే పనిచేశారని ధర్మశ్రీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో గ్రూపు రాజకీయాలు ఉండరాదని మంత్రి అమర్‌నాథ్ సమక్షంలో విశాఖ డెయిరీ లోపల ఆదివారం పంచాయితీ ఏర్పాటుచేశారు. మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, ఆడారి ఆనంద్‌కుమార్, మండలానికి చెందిన ఎంపిటిసిలు, జడ్‌పిటిసి సభ్యులు రాంబాబు హాజరయ్యారు. కర్ణం ధర్మశ్రీకి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని జడ్‌పిటిసి సభ్యులు రాంబాబు పట్టుబట్టారు. గేదెల సత్యనారాయణతో పాటు మరో ఎంపిటిసి సభ్యుడు ధర్మశ్రీకి వ్యతిరేకంగా మాట్లాడారు. ఈ క్రమంలో జడ్‌పిటిసి గ్రూపునకు, గేదెల సత్యనారాయణ గ్రూపునకు మధ్య వివాదం చోటుచేసుకుంది. ఇరు గ్రూపులు కేకలు వేసుకున్నారు. ఒకరినొకరు చొక్కాలు పట్టుకుని తోసుకున్నారు. వివాదం పెద్దది కావడంతో విశాఖ డెయిరీ సెక్యూరిటీ సిబ్బంది కల్పించుకొని వారందరినీ బయటికి పంపించేశారు.

శ్రీకృష్ణదేవరాయలు, వంగవీటి విగ్రహావిష్కరణలు

సమావేశంలో మాట్లాడుతున్న బొత్స ఝాన్సీ

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి పద్మనాభనగర్‌లో శ్రీకృష్ణదేవరాయలు, వంగవీటి మోహనరంగా విగ్రహాలను రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, వైసిపి పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. కాపుల అభివృద్ధికి వారు చేసిన కృషిని వక్తలు కొనియాడారు. అనంతరం పద్మనాభనగర్‌లో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న కాపు కల్యాణ మండపాన్ని పరిశీలించారు. జివిఎంసి 90వ వార్డులో రూ.2.30 కోట్లతో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణాన్ని త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు విజయప్రసాద్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కో ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, శ్రీకృష్ణదేవరాయ కాపు, తెలగ, బలిజ సంక్షేమ సంఘ సభ్యులు, 91, 92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, గొర్రె అప్పలస్వామి నాయుడు, నాయకులు గేదెల మురళీకృష్ణ, బండారు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలలే దేశ సంపద

ప్రజాశక్తి -ములగాడ : బాలలే దేశ సంపద అని, వారు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండడంపైనే దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. తాటిచెట్లపాలెం, కంచరపాలెంలోని మురికివాడల వీధి బాలలు, బిపిఎల్ కుటుంబాలకు చెందిన చిన్నారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, మురికివాడల్లో నివసించే చిన్నారుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. వారిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా డాన్‌బాస్కో నవజీవన్ సంస్థకు చెందిన డైరెక్టర్ ఫాదర్ అరుల్ దాస్, ఫాదర్ కల్యాణ్‌బాబు మాట్లాడుతూ, మురికివాడల్లో నివసిస్తున్న బాలల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని, స్వచ్ఛంద సంస్థలు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. బాలలు వ్యక్తిగత పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, వారు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి అధ్యాపకులు వలీషా ప్రసంగించారు. అనంతరం కళాశాలలో ఇటీవల నిర్వహించిన చారిటీషోల ద్వారా వచ్చిన ఆదాయంతో సుమారు 150 మందికి స్కూలు యూనిఫాం, టీ షర్ట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిస్టర్ సంధ్య, సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు, డాన్ బాస్కో సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-పెందుర్తి : 2004లో వేపగుంట హైస్కూల్లో పదోతరగతి చదివి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. హరె.. ఒరె.. అంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎవరెవరు ఏ పనులు చేస్తున్నారో చర్చించుకున్నారు. సంవత్సరానికి ఒక్కసారి అయినా అందరమూ కలవాలని నిర్ణయించుకునానరు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి సౌజన్య మాట్లాడుతూ, స్నేహానికి వృత్తులు అడ్డుకావన్నారు. మన స్నేహం అందరికీ స్ఫూర్తి కావాలన్నారు. సంవత్సరానికి ఒక్కసారైనా వనభోజన కార్యక్రమం ఏర్పాటుచేసుకుందామని సూచించారు.

వేపగుంట హైస్కూల్లో కలుసుకున్న 2004 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు



యువకునిపై కేసు

ప్రజాశక్తి - ఆరిలోవ : వాహన తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐని కారుతో ఢీకొట్టిన ఘటనలో యువకునిపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... విశాఖ వేలీ స్కూలు వద్ద ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ ఆధ్వర్యాన శనివారం రాత్రి వాహన తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో పెదవాల్తేరుకు చెందిన యువకుడు వాహనం ఆపకుండా ముందుకు దూసుకు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐపైకి దూసుకు రావడంతో కాలుకు చిన్నపాటి గాయాలయ్యాయి. ఆదివారం కారును గుర్తించారు. కారు నడిపిన వ్యక్తి పెదవాల్తేరుకు చెందిన వెంకట్‌గా గుర్తించి, కారును సీజ్ చేసి ఆయనపై కేసు నమోదు చేశారు.

43 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక శివారు కొండపాలెం గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శనివారం రాత్రి 43 మద్యం సీసాలను పోలీసులు పట్టుకున్నారు. మద్యం విక్రయిస్తున్న ఆ గ్రామానికి చెందిన గనగళ్ల ముత్యాలును అరెస్టు చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు అచ్యుతాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.బుచ్చిరాజు తెలిపారు. పట్టుబడిన మద్యం సీసాలు విలువ రూ.5445 ఉంటుందని చెప్పారు.

పల్సర్ బైక్ అపహరణ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం ఎల్బీపీ అగ్రహారం గ్రామంలో శనివారం అర్ధరాత్రి పల్సర్ బైక్ అపహరణకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఎల్‌బిపి.అగ్రహారంలోని విశ్వబ్రాహ్మణ సామాజిక తరగతికి చెందిన నక్క నర్సింగరావు పల్సర్ బైక్‌ను జనవరి 3వ తేదీని కొనుగోలు చేశారు. నరసింగరావు మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న తన ఇంటి ముందునే శనివారం రాత్రి పార్కింగ్ చేసి నిద్రిస్తుండగా, అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆ బైక్‌ను అపహరించుకుపోయారు. ఆదివారం తెల్లవారు లేచి చూసేసరికి పార్కింగ్ చేసిన బైక్ లేకపోవడంతో లబోదిబోమంటూ బుచ్చయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ నాయుడు సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా రాత్రి పూట స్థానిక యువకులు గ్రామ వీధుల్లో సంచరించడం పలు అనుమానాలకు దారితీస్తుంది

'బౌద్ధం ద్వారా అసమానతలు దూరం'

ప్రజాశక్తి-సీతమ్మధార : బౌద్ధ ధర్మం ద్వారా అసమానతలు దూరం చేయొచ్చని పలువురు బౌద్ధ మేధావులు పేర్కొన్నారు. నగరంలోని బుల్లయ్య కాలేజీ సమీపంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన 11వ బౌద్ధ మహా సమ్మేళనాన్ని నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి బౌద్ధులు పెద్ద సంఖ్యలో హాజరై గౌతమ్ బుద్ధుడు, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాబాగార్డెన్స్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి అంబేద్కర్ భవన్ వరకు దమ్మ జ్యోతి ర్యాలీ నిర్వహించారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో డాక్టర్ అయూపాల మహతెరో (మయన్మార్) సారిపుత్ర ధర్మ ప్రబోధన చేశారు. వీసీకే అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, వాగ్గేయకారుడు మచ్చ దేవేందర్, బాంసెఫ్ జాతీయ నాయకుడు నల్లా గంగాధర్, బౌద్ధ రచయిత డి.నటరాజ్ సాఖ్య, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు ప్రసంగించారు.

వైసిపి మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా జ్యోతి

ప్రజాశక్తి - కశింకోట: కశింకోట మండల పరిషత్తు ఉపాధ్యక్షులు పెంటకోట జ్యోతి వైసిపి మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. మహిళా అన్ని రంగాల్లో రాణించాల్సి ఉందని చెప్పారు. తనను వైసిపి మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంపిక చేయడం పట్ల ధన్యావాదాలు తెలిపారు.

ఆందోళన చేపట్టిన టిడిపి కార్యకర్తలు

పీలా గోవింద్‌కు టికెట్ ఇవ్వాలని ఆందోళన

కశింకోట : అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందా సత్యనారాయణకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండల కేంద్రం కశింకోటలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గానికి అనేక సేవలు అందించిన పీలా గోవిందకు టికెట్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఏ గ్రామానికి వెళ్ళినా పేరు పెట్టే కార్యకర్తలను పిలుస్తారని, అటువంటి వ్యక్తిని, కార్యకర్తలు మనోభావాలను కాదని జనసేనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం సరికాదన్నారు. అనకాపల్లి ఎమ్మెల్యే టిడిపికి, ఎంపీ టికెట్ జనసేనకు కేటాయించాలని కోరారు. పీలా గోవిందకు టికెట్ ఇవ్వకుంటే రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉగ్గని రమణమూర్తి, పెంటకోట రాము, సిదిరెడ్డి శీను, బుధిరెడ్డి గంగయ్య, వేగి గోపికృష్ణ, కాంద్రేగులు సతీష్, కలగ సోమేశ్వరరావు, సీరంశెట్టి వెంకటలక్ష్మి, కొతం ఈశ్వరమ్మ, మళ్ల లోవకృష్ణ, వేగి వెంకటరావు, సిదిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

రాజేష్‌ను సత్కరిస్తున్న ఐద్వా జాతీయ నాయకులు

ఫొటో జర్నలిస్టు రాజేష్‌కు సత్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల జాతీయ స్థాయిలో ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా అవార్డు దక్కించుకున్న ప్రజాశక్తి ఫొటో జర్నలిస్టు కె.రాజేష్‌ను ఐద్వా నాయకులు సత్కరించారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పిఆర్.శ్రీమతి, ప్రధాన కార్యదర్శి మరియం థావలే రాజేష్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సంఘం జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా జనుము

ప్రజాశక్తి -కోటవురట్ల : ప్రస్తుత రబీ సీజన్‌లో మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో సాగులో ఉన్న జనుము పంట ఆశాజనకంగా ఉంది. ఏజెన్సీ ప్రాంతాన్ని తలపించే విధంగా వలిసె పువ్వుల అందాలు మైదానంలోనూ మంత్రముగ్ధులను చేస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా సాగు చేస్తున్న జనుము పంట ఆహ్లాదకరంగా దర్శనం ఇవ్వడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు, మండల వ్యాప్తంగా దాదాపుగా అన్ని గ్రామాల్లో సాగులో ఉన్న జనుము పంట ప్రస్తుతం పూత దశలోఉంది. జనుము సాగుతో ప్రస్తుతం ఆదాయంతోపాటు వచ్చే ఖరీఫ్ సీజన్‌కు భూమి సారవంతమవుతుందని రైతులు అంటున్నారు. అకుపచ్చ, పసుపు పూల కలయికతో నేలంతా పరుచుకున్న వలిసె పూల అందాలు ప్రకృతి ప్రేమికులను తన్మయులను చేయడంతోపాటు రైతులకు మంచి ఆదాయాన్ని చేకూర్చేందుకు పైర్లు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యమాల్లో జయగోపాల్ పాత్ర మరువలేనిది

జయగోపాల్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యమాల్లో జయ గోపాల్ ప్రభావం ఎంతో ఉందని, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా ఆయన అలుపెరుగని పోరాటం చేశారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి అన్నారు. సాంఘిక ఉద్యమకారుడు డాక్టర్ జయ గోపాల్ సంస్మరణ సభ ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ నేతృత్వంలో నిర్వహించారు. సభలో సత్యనారాయణమూర్తి ప్రసంగిస్తూ తెలుగు నాట ముగ్గురు గోపాల్‌లులో జయ గోపాల్ ఆనాడు సమాజాన్ని ప్రభావితం చేశారన్నారు. ఒకప్పుడు సామాజిక కార్యక్రమాలలో యువత ఉండేదని, నేడు అది కరువైందని విచారం వ్యక్తం చేశారు. ఆయన లేకపోయినా ఉద్యమం ఉందని, దానిని మరింతగా ముందుకు తీసుకుపోవాలని అన్నారు. జయ గోపాల్ తన కుటుంబ సభ్యులందరినీ ఆ దిశగా తీసుకుని వెళ్లారని, దానిని ఉద్యమంలో ఉన్న వారు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చెన్నయ్ నుంచి విచ్చేసిన ద్రవిడ కజగం నేత వీరమణి కుమారుడు వి.అంబురాజు ప్రసంగిస్తూ జయగోపాల్ సాంస్కృతిక, సాంఘిక విప్లవకారుడని, తెలుగు రాష్ట్రాల్లోని యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఉద్యమం చేపట్టడమే కాకుండా తమిళనాడులో కూడా ఆనాడు పెరియర్‌తో కలిసి పని చేశారని గుర్తు చేశారు. విశాఖలోని బీచ్ రోడ్డులో పెరియార్ విగ్రహం ఏర్పాటుకు జయ గోపాల్ కృషి మరువలేనిదన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ మత, కులతత్వంపై ప్రశ్నించేతత్వాన్ని యువతకు అలవర్చాల్సిన అవసరం ఉందన్నారు. జయ గోపాల్ చెప్పిన సాంస్కృతిక విప్లవం ఎంత అవసరమో నేటి పరిస్థితులు తెలియజేస్తున్నాయని, ఆ దిశగా ఉద్యమించడమే జయ గోపాల్‌కి ఇచ్చే నివాళి అని అన్నారు. కార్యక్రమంలో లీడర్ సంపాదకులు వివి.రమణమూర్తి, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ, దళిత సేన రాష్ట్ర నాయకులు పాల్తేటి పెంటారావు, చైతన్య మహిళా సంఘం అధ్యక్షురాలు డి.లలిత, న్యాయవాది గంటా మోహనరావు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా భవనాలకు వెళ్లేదెలా.?

రహదారి కల్పనలో నిండా నిర్లక్ష్యం
ప్రారంభోత్సవాలకు అదే అడ్డంకి
పట్టించుకోని అధికారులు, నేతలు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో పందూరు గ్రామంలో ప్రభుత్వం ఆర్భాటంగా రూ.లక్షలు వెచ్చించి రైతు భరోసా, ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత భవనాలుగా చెప్పుకునే వీటి వద్దకు వెళ్లే దారి సంగతి మాత్రం మరిచారు.దీంతో ఇక్కడ నిర్మించిన భవనాలు దాదాపు రెండేళ్ల క్రితమే పూర్తయినా నేటికీ భవనాల వద్దకు వెళ్లే దారి సక్రమంగా లేక ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. వ్యవసాయ సేవలకు రైతుభరోసా కేంద్రాలకు వెళ్లే దారిలేక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు, అలాగే ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించి నెలలు గడుస్తున్నా నేటికీ ప్రారంభం కాకపోవడానికి దానికి సరైన దారి లేకపోవడమే ప్రధాన కారణం. అయితే ఇక్కడ దీని నిర్మాణానికి సంబంధించి సంబంధిత కాంట్రాక్టర్‌కు నేటివరకు బిల్లులు చెల్లించకపోవడంతో భవనం అప్పగించకపోవడం మరోకారణంగా తెలుస్తోంది.

ఆయా కేంద్రాలకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో, మార్గమధ్యలో ఉన్న కొండవాలు గెడ్డ వద్ద తాత్కాలికంగా నడిచి వెళ్లేందుకు విరిగిన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు,. వాటిపై నుంచి వెళ్లేందుకు ఉద్యోగులు, ప్రజలు భయపడుతున్నారు. వాటిపై నుంచి ఎక్కడ అదుపుతప్పి పడిపోతామేమోనని ఆందోళన చెందుతున్నారు.రైతు భరోసా కేంద్రాల నుంచి ఎరువులు, విత్తనాలను తెచ్చుకోవడంతోపాటు చిన్నపాటి వ్యవసాయ సలహాకైనా రైతుభరోసా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితుల్లో సరైన దారి లేకపోవడంతో అక్కడకు వెళ్లే వీలులేక, ఆయా కేంద్రాల సేవలు రైతులకు దూరమౌతున్నాయని ఆరోపణలున్నాయి. దీనిపూ నేతలు, అధికారులకు అనేకసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు, స్థానిక నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి, రైతుభరోసా కేంద్రానికి, ఆరోగ్య ఉప కేంద్రానికి సక్రమమైన దారి ఏర్పాటు చేయాలని, మార్గమధ్యలో గెడ్డపై కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

దారిలేని చోట కొండవాలులో నిర్మించిన ప్రభుత్వ భవనాలు

ఆటో బోల్తా : మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని జోగుంపేట జంక్షన్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. నర్సీపట్నం నుండి కృష్ణదేవిపేట వైపు వెళ్తున్న ఆటో, జోగుంపేట జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నర్సింగబిల్లి గ్రామానికి చెందిన కొరుప్రోలు రమణమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. ఆటోలో ఉన్న మిగతా ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

అధ్వాన రోడ్డు వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

రోడ్డును బాగు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గ పరిధిలోని రామకృష్ణ థియేటర్ జంక్షన్, రైతు బజార్ పక్కన ఆర్బర్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ చాలా కాలం నుంచి రోడ్లు పూర్తిగా పాడైపోయినప్పటికీ మరమ్మతులకు నోచుకోలేదన్నారు. ఈ రోడ్లపై ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారికి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అటు పోర్టుకు, ఇటు చావుల మధుం, కంచరపాలెం, నేవల్ డాక్‌యార్డ్, హెచ్‌పిసిఎల్ వైపు వెళ్లే ప్రధాన రహదారి ఇదని తెలిపారు. కార్యక్రమంలో రిక్షా పుల్లర్స్ యూనియన్ నాయకులు కె.నాగరాజు, నర్సింగరావు, అయ్యన్న, మోటార్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.గణేష్, సిఐటియు నాయకులు చంద్రమౌళి, హోటల్ యూనియన్ నాయకులు ఎర్రి బాబు పాల్గొన్నారు

చెట్టును నరికిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజలకు నీడ కల్పిస్తూ, స్వచ్ఛమైన గాలి అందిస్తున్న చెట్టును దుకాణానికి అడ్డుగా ఉందని చెప్పి నరికి వేసిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం. సుబ్బారావు డిమాండ్ చేశారు. చెట్టును తొలగించిన ప్రదేశంలో రిక్షా కార్మికులతో కలిసి ఆదివారం ఆయన నిరసన తెలిపారు.

విశాఖ మ్యూజియాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల ఆధునికీకరణ పనులు పూర్తి చేసుకొని అందుబాటులోకి వచ్చిన విశాఖ మ్యూజియంను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సందర్శించారు. ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులో ఫ్లోటింగ్ బ్రిడ్జిని ప్రారంభించిన అనంతరం జీవీఎంసీ కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, జేసీ కె.మయూర్ అశోక్‌లతో కలిసి మ్యూజియాన్ని కలెక్టర్ సందర్శించారు. కళాకారులు తయారు చేసిన క్రాఫ్ట్, ఆర్టులను పరిశీలించారు.

ఎపి జెఎసి నిర్ణయం సరికాదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : లక్షలాది మంది ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పోరాటం చేయాల్సిన ఎపి జెఎసి ప్రభుత్వం నుండి ఎటువంటి స్పష్టతా లేకుండానే ఈ నెల 27న నిర్వహించతలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని వాయిదా వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్‌లు తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సరెండర్ లీవులు, పిఆర్‌సి బకాయిలు తదితర రూ.20 వేల కోట్ల ఆర్థిక బకాయిలు చెల్లింపులపై మినిట్స్ జారీ చేసారే తప్ప ఏ విధమైన ఉత్తర్వులూ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-మాకవరపాలెం : మాకవరపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1994-95లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం కోలా కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం అలనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని, ఆనందంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

సమాచార హక్కు చట్టం మహాసభలకు జిల్లా ప్రతినిధులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నంద్యాల జిల్లా నంద్యాల పట్టణంలో ఆదివారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సమాచారహక్కు చట్టం 2005 ద్వితీయ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సభలకు అనకాపల్లి జిల్లా ప్రతినిధులు షేక్ జీలానీ, షేక్ షాహీన్ షా తదితరులు హాజరయ్యారు.